కిన్నెరసాని నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

పాల్వంచ రూరల్, ఆగస్టు 31: కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి వరద నీటి విడుదల శనివారమూ కొనసాగింది. కిన్నెరసాని ఎగువనున్న బయ్యారం, ఇల్లెందు, టేకులపల్లి తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద నీరు కిన్నెరసాని ప్రాజెక్టులోకి భారీగా చేరుతున్నది. శుక్రవారం రాత్రి రెండు గేట్ల నుంచి నీటి విడుదలను అధికారులు ప్రారంభించారు. శనివారం మరో గేటు కూడా తెరిచారు. ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో శనివారం 13,000 క్యూసెక్కులు ఉంది. మూడు గేట్ల ద్వారా 8,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇన్‌ఫ్లో తగ్గడంతో కొన్ని గంటలపాటు గేట్లు మూసివేశారు. పూర్తి స్థాయి నీటి మట్టం 407 అడుగులు. శనివారం సాయంత్రం ఇన్‌ఫ్లో 4,000 క్యూసెక్కులు, నీటి మట్టం 404.3 అడుగులు ఉంది. శనివారం రాత్రి మరోసారి రెండు గేట్ల ద్వారా 8,000 క్యూసెక్కుల నీటిని వదిలారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ, ఆగస్టు 31: పట్టణంలోని వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని గ్రామాల్లో, బస్తీల్లో పక్కా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు. తహసీల్దార్ వివేక్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మవోయిస్టుల డంపు స్వాధీనం

జవాన్లు స్వాధీనం చేసుకున్న డంపు

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 31 : ఒడిశా రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టుల కోసం జల్లెడ పడుతున్న భద్రతా దళాలకు డంపు లభ్యమైంది. ఇందుకు సంబంధించిన వివరాలను మల్కాన్‌గిరి పోలీసు అధికారులు శనివారం వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా కలిమెల పోలీస్‌స్టేషన్ పరిధిలో భేజంగివాడి అడవుల్లో బీఎస్ఎఫ్ 142 బెటాలియన్‌కు చెందిన భద్రతా దళాలు సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించాయి. ఈ క్రమంలో మెలిలాతుంగ్ గ్రామ సమీపంలోని ఓ గుహలో మావోయిస్టులు దాచిన డంపును జవాన్లు గుర్తించారు. దానిని పరిశీలించడంతో అందులో ఐఈడీ బాంబులు, 62 జిలిటెన్ స్టిక్‌లు, బ్యాటరీలు, విద్యుత్ వైర్లు, సోలార్ ప్యానెళ్లు, మావోయిస్టుల యూనిఫాంతోపాటు వారికి సంబంధించిన కరపత్రాలు, విప్లవ సాహిత్యాలను జవాన్లు స్వాధీనం చేసుకున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పనులను పరిశీలిస్తున్న ఐటీసీ, పంచాయతీ అధికారులు

సారపాక, ఆగస్టు 31: సారపాకలోని పాత సారపాక, గాంధీనగర్, రాజీవ్‌నగర్, విజయనగర్, భాస్కర్ నగర్ ప్రాంతాల్లో ఐటీసీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న అభివృద్ధి పనులను ఐటీసీ పీఎస్‌పీడీ అడ్మిన్ మేనేజర్ చెంగల్‌రావు, పంచాయతీ ఈవో కంది మహేశ్, కాంగ్రెస్ నాయకులు శనివారం పరిశీలించారు. ప్రజలకు అవసరమైన పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మహమూద్‌ఖాన్, చల్లా వెంకటనారాయణ, పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, గుంటక శేషిరెడ్డి పేరాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

మాట్లాడుతున్న ఏజే రమేష్

ఇల్లెందు రూరల్, ఆగస్టు 31: రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన శనివారం ఇల్లెందులోని పార్టీ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. ఇల్లెందు ప్రభుత్వాసుపత్రిలో ప్రతి రోజూ 800 మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారని, ఇంకా అనేకమంది ఇన్ పేషెంట్లుగా ఉంటున్నారని చెప్పారు. ఆసుపత్రిలో మందులు సరిపడినన్ని లేవని, వైద్య పరికరాలు సరిగ్గా పనిచేయడం లేదని అన్నారు. ఈ కారణంగా వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో, గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి అబ్దుల్ నభి, నాయకులు ఆలేటి కిరణ్‌కుమార్, మన్యం మోహన్‌రావు, సర్వన్‌కుమార్, షేక్ ఖాదర్, సుల్తానా, మునిగంటి లక్ష్మి, మహమూద్, నాగరాజు, రాజమొగిలి, తాళ్ళూరి పద్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
ADMISSIONS
★Seats available in Engineering, Medical & other Courses in Colleges of Hyderabad. Contact: 7799111873, 7799111874.
NT-333107-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సీపీఆర్‌తో ప్రాణదానం

పాల్వంచ రూరల్, ఆగస్టు 31: గుండెపోటుతో కుప్పకూలిన ఓ వ్యక్తికి ఓ ప్రైవేట్ వైద్యుడు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. యానంబైలుకు చెందిన సాంబశివరావు, శనివారం ఉదయం స్నేహితులతో మాట్లాడుతూ.. మాట్లాడుతూనే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అతడిని స్నేహితులు వెంటనే కిన్నెరసానిలోని ప్రైవేటు డాక్టర్ గుండా శ్రీనివాసరావువద్దకు తీసుకొచ్చారు. తక్షణమే సీపీఆర్ చేయడంతో సాంబశివరావు స్పృహలోకి వచ్చాడు. అతనికి ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఆస్పత్రికి పంపించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

వానలు.. వరదలు

పాల్వంచ: లోతట్టు ప్రాంతంలో వర్షపు నీరు

అశ్వారావుపేట టౌన్ : పట్టణంలో కురుస్తున్న వర్షం

పాల్వంచ: పట్టణంలో కురుస్తున్న భారీ వర్షం

తుపాన్ ప్రభావంతో జిల్లావ్యాప్తంగా శుక్ర, శని వారాల్లో వర్షాలు కురిశాయి. చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరింది. కొన్నిచోట్ల ఇవి పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. వాన ముసురుకు జనజీవనం స్తంభించింది.
– నమస్తే నెట్‌వర్క్

నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా జరగాలి

బలవంతంగా చందాలు వసూలు చేస్తే చర్యలు
పీస్ కమిటీ మీటింగ్‌లో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 31: గణపతి నవరాత్రోత్సవాలను కమిటీల బాధ్యులు ప్రశాంతంగా నిర్వహించాలని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ కోరారు. ఉత్సవాల పేరుతో ప్రజల నుంచి బలవంతంగా చందాలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉత్సవ కమిటీల బాధ్యులతో, ముస్లిం మత పెద్దలతో స్థానిక పీఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం 'పీస్ కమిటీ మీటింగ్' నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వినాయక మండపాల ఏర్పాటులో, నిమజ్జనాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, తప్పనిసరిగా పాటించాల్సిన మార్గదర్శకాలను వివరించారు. మండపాలు ఏర్పాటుకు అన్ని అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మండపాల వద్ద ఉండే వలంటీర్ల పేర్లు తప్పనిసరిగా నమోదు కావాలన్నారు. డీజేలు, పెద్ద పెద్ద మైకులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నిమజ్జన ఉత్సవాల్లో పాల్గొనేవారు మద్యం తీసుకోకూడదని చెప్పారు. ట్రాఫిక్ సమస్యలు రాకుండా, పూర్తి కండిషన్‌లో ఉన్న వాహనాల్లోనే విగ్రహాలను తీసుకెళ్లాలని సూచించారు. బలవంతంఆ చందాలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరమత సహనంతో, సోదరభావంతో మెలగాలని కోరారు. వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు, టూ టౌన్ ఇన్స్పెక్టర్ టి.రమేష్, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ కాగితోజు శివప్రసాద్, కొత్తగూడెం సబ్ డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, ఉత్సవ కమిటీల బాధ్యులు కంచర్ల చంద్రశేఖర్, ఆర్.కిరణ్, డి.రమేష్, బి.శ్రీధర్, కె.వెంకట్, శ్రీరాములు, విశ్వహిందూ పరిషత్ కమిటీ సభ్యుడు గణేష్, ముస్లిమత పెద్దలు రజాక్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు విశ్రాంతి.. సేవకులకు సన్మానం

లక్ష్మీదేవిపల్లి: చాతకొండ బెటాలియన్‌లో సన్మానం

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 31: ప్రభుత్వ ఉద్యోగులుగా సుదీర్ఘకాలంపాటు సేవలందించిన కొందరు.. శనివారం 'విశ్రాంతి' తీసుకున్నారు. చాతకొండ 6వ బెటాలియన్‌లో శనివారం ఉద్యోగ విరమణ పొందిన ఏపీ జి.వెంకటేశ్వర్లును, ఏఆర్ ఎస్సై నాగ భూషణాన్ని బెటాలియన్ అదనపు కమాండెంట్ అంజయ్య సన్మానించి వీడ్కోలు పలికారు. అసిస్టెంట్ కమాండెంట్ అబ్దుల్ రషీద్, ఆర్ఐలు రామారావు, ఉదయ్‌కుమార్, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 31: సుజాతనగర్ ఉన్నత పాఠశాల హెచ్ఎం చిట్టూరి వీరభద్రం శనివారం ఉద్యోగం విరమించారు. ఆయనను టీపీసీసీ సభ్యుడు నాగ సీతారాములు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు సన్మానించారు. ఎండీ కరీం, యల్లంకి చిన నర్సింహారావు, బొబ్బల వెంకట్, రేగళ్ల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు రూరల్, ఆగస్టు 31: ఉద్యోగం విరమించిన జేకే 5 ఓసీ గని ఈపీ ఫిట్టర్, మెకానిక్ మందరమేష్‌బాబును శనివారం ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణమోహన్ సన్మానించారు. సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, ఇంజినీర్ శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సుధాకర్, యూనియన్ నాయకులు సంజీవాచారి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి, ఆగస్టు 31: ఉద్యోగం విరమించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎస్.పిచ్చయ్యను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్,మాజీ ఎంపీపీ భూక్యా రాధ శనివారం సన్మానించారు. నాయకులు భూక్యా సైదులు నాయక్, చీమల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి, ఆగస్టు 31: మండలంలోని కోయగూడెం ఎంపీయూపీఎస్ హెచ్ఎం సిహెచ్.శ్రీనివాసరావు శనివారం ఉద్యోగం విరమించారు. ఆయనను మాజీ సర్పంచ్ కోరం సురేందర్ సన్మానించారు. పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రవీందర్, మండల అధ్యక్షుడు జి.మోతీలాల్, నాయకులు రమేష్‌బాబు, పన్నాలాల్, బాబా సఫీ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

మాట్లాడుతున్న అహోబిల రామానుజ జీయర్ స్వామి

అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 31: ఆధ్యాత్మకతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని అహోబిల రామానుజ జీయర్ స్వామి అన్నారు. స్థానిక బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని కోరారు.

దేవాదాయ శాఖ స్థపతి సందర్శన

బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ స్థపతి శ్రీవల్లి నాయగం శనివారం సందర్శించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో గోశాల, యాగశాల, కోనేరు, వంటశాల, తాగునీటి ప్లాంట్ ఏర్పాటుకు సూచనలు చేశారు. అసిస్టెంట్ స్థపతి గణేశన్, అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి, మేనేజర్ వెంకటరమణ పాల్గొన్నారు.

రెజ్లింగ్ అకాడమీకి ఎంపిక పోటీలు

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 31: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11, 12 తేదీల్లో హర్యానా రాష్ట్రంలోని రెజ్లింగ్ అకాడమీలో ప్రవేశానికి ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాశీహుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల 12 నుంచి 18 సంవత్సరాల లోపు వయసున్న బాలురు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పుట్టిన తేదీ సర్టిఫికెట్ (ఒరిజినల్), స్టడీ సర్టిఫికెట్, రెజ్లింగ్ గెలుపొందిన సర్టిఫికెట్ల హాజరుకావాలని వివరించారు. 99497 61181 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

పాఠశాలల్లో వైద్య శిబిరాలు

టేకులపల్లి, ఆగస్టు 31: టేకులపల్లి మహాత్మా జ్యోతిబా పూలే, కోయగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సులానగర్ పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రావు, అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'ఏజెన్సీ ఎస్సీలకు ప్రాధాన్యం ఇవ్వాలి'

టేకులపల్లి, ఆగస్టు 31: ఏజెన్సీ ప్రాంతాల్లో చిరకాలంగా ఉంటున్న ఎస్సీలకు అభివృద్ధిలో ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్సీ హక్కుల పోరాట జేఏసీ నాయకులు శనివారం బోడు రోడ్డు సెంటర్ నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు.

'నమస్తే' కథనానికి స్పందన

విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న అధికారులు

రామవరం, ఆగస్టు 31: 'ప్రమాదం అని తెలిసినా పట్టించుకునే వారేరి..' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ఈ నెల 28న ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ ఏఈ నరసింహారావు స్పందించి మరమ్మతులు చేయించారు. విద్యుత్ తీగెలు వేలాడుతుండడం, అక్కడే వినాయక మండపం ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. దీనిపై 'నమస్తే'లో కథనం ప్రచురితమైంది. దీనికి ఏఈ స్పందించారు. విరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేశారు.

కరపత్రం ఆవిష్కరణ

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 31: ఎన్నికల హామీలను అమలు చేయాలని, రైతుల రుణాలను బేషరతుగా మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా జరగనుంది. ఈ కార్యక్రమ ప్రచార కరపత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు రంగయ్య, నాయకుడు గుమ్మడి నర్సయ్య శనివారం కొత్తగూడెంలోని కార్యాలయంలో ఆవిష్కరించారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పాల్వంచ రూరల్, ఆగస్టు 31: ఆర్థిక సమస్యలను భరించలేని వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాల్వంచ పట్టణానికి చెందిన కొల్లి నరేంద్ర(34) చిరు వ్యాపారి. వ్యాపారంలో నష్టాలు వస్తున్నాయని, తెచ్చిన అప్పులు తీరడం లేదని భార్య అనిత వద్ద తరచూ ఆవేదన వ్యక్తం చేస్తుండేవాడు. అతడు శుక్రవారం మద్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి వేళ, తన స్నేహితులకు ఫోన్ చేసి, జీవితంపై విరక్తితో గడ్డి మందు తాగి చనిపోతున్నానని చెప్పాడు. ఈ సమాచారంతో కుటుంబీకులు, బంధువులు అన్నిచోట్ల గాలించారు. మండలంలోని బిక్కుతండా సమీపంలో అపస్మారక స్థితిలో కనిపించిన నరేంద్రను పాల్వంచ ఆసుపత్రికి తరలించారు. అతడు అక్కడే శనివారం మృతి చెందాడు. భార్య అనిత ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోనోకార్పస్ మొక్కలు తొలగింపు

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 31: పర్యావరణానికి ముప్పుగా మారిన కోనోకార్పస్ మొక్కల తొలగింపు.. మండలవ్యాప్తంగా సాగుతున్నది. అశ్వారావుపేటలోని పల్లె పకృతి వనాలతోపాటు రహదారుల పక్కన వీటిని పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారు. వీటి తొలగింపునకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించిన విషయం పాఠకులకు తెలిసిందే.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

నిత్యకల్యాణం జరిపిస్తున్న అర్చకులు

బూర్గంపహాడ్ (భద్రాచలం), ఆగస్టు 31: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులకు శనివారం అర్చకులు స్వర్ణ తులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి నిత్యకల్యాణం జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

ఖుర్షిద్ అహ్మద్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు

మణుగూరు టౌన్, ఆగస్టు 31: మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీపై వచ్చిన ఖుర్షిద్ అహ్మద్ రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 5న హైదరాబాద్‌లో జరిగే గురుపూజోత్సవ వేడుకలకు హాజరుకావాల్సిందిగా సమాచారం అందిందని ఖుర్షిద్ శనివారం తెలిపారు. 2014-2024 వరకు భద్రాచలం జూనియర్ కళాశాలలో పొలిటికల్ సైన్స్ లెక్చరర్‌గా విధులు నిర్వహించి ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చారు.

బుగ్గ, ఖమ్మంతోగులో వైద్య శిబిరం

పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మణుగూరు టౌన్, ఆగస్టు 31: మణుగూరు పీహెచ్‌సీ పరిధిలోని బుగ్గ, ఖమ్మంతోగు గ్రామాల్లో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ శివకుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైర్లు, పూలకుండీలు, కాళీసీసాలు, గ్లాసులు, రోళ్లు, తొట్లలో ఉన్న నీటిని తోలిగించుకుని వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి వీరస్వామి, అరుణ్ బాబు, రాంప్రసాద్, ఉమేశ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

67శాతం బొగ్గు ఉత్పత్తి : జీఎం

మణుగూరు టౌన్, ఆగస్టు 31: ఆగస్టు నెలలో మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 7.98లక్షల టన్నులకు గాను 5.36లక్షల టన్నుల బొగ్గు వెలికితీసి 67శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ శనివారం తెలిపారు. శనివారం జీఎం సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. ఓబీ వెలికితీత 81శాతం, 6.95లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామన్నారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

కుమ్రం భీం విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ

కుమ్రం భీం విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ చేస్తున్న ఆదివాసీ నాయకులు

దుమ్ముగూడెం, ఆగస్టు 31: మండలంలోని ములకపాడు జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహం పక్కన ఆదివాసీల ఆరాధ్య దైవం కుమ్రం భీం విగ్రహ ఏర్పాటుకు శనివారం ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ బాధ్యులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఐక్యకార్యాచరణ కమిటీ బాధ్యులు కొమరం దామోదరరావు, సోయం కామరాజు, సరియం కోటేశ్వరరావు, రాజమ్మ, మాజీ జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, మాజీ ఎంపీటీసీలు సోడి తిరుపతిరావు, తెల్లం భీమరాజు, కణితి రాముడు, తెల్లం హరికృష్ణ, కారం పుల్లయ్య, కణితి లక్ష్మణుడు, ముర్రం వీరభద్రం, పొడియం సుబ్బారావు, కోడి చంటి, వాగే కృష్ణ, కుర్సం రవి, కొండ్రు నర్సింహారావు, కొమరం గజేందర్ పాల్గొన్నారు.

రూ.3.75లక్షల గంజాయి పట్టివేత

పట్టుబడిన గంజాయి, నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

బూర్గంపహాడ్ (భద్రాచలం), ఆగస్టు 31: భద్రాచలం బ్రిడ్జి సమీపంలోని చెక్ పోస్టు వద్ద రూ.3.75లక్షల విలువైన 19 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ చెక్‌పోస్టు సీఐ లావణ్య శనివారం తెలిపారు. ఎక్సైజ్ సీఐ లావణ్య తెలిపిన వివరాల ప్రకారం.. ముంబాయికి చెందిన వ్యక్తి ఒడిస్సాకు వెళ్లి అక్కడ గంజాయిని కొనుగోలు చేసి ముంబాయికి తరలించే క్రమంలో బ్రిడ్జి సమీపంలో చెక్‌పోస్టు వద్ద హైదరాబాద్ బస్సు ఎక్కే ప్రయత్నం చేశాడు. బ్రిడ్జి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఆ వ్యక్తిపై అనుమానం వచ్చి బ్యాగును తనిఖీ చేయగా గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించామని సీఐ తెలిపారు.

5న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఆళ్లపల్లి, ఆగస్టు 31: వ్యవసాయ కార్మికులకు కూలీ భరోసా పథకం ఏర్పాటు చేయాలని, ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5వ తేదీన కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ నాయకుడు కొమరం హనుమంతరావు, పరమ ఇమ్మాన్యుయేల్, నరెడ్ల రాంబాబు కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. శనివారం ఆళ్లపల్లిలో విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల గ్రామీణ పేదల సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున ఉద్యమిద్దామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సహదేవ్, శ్రీను, మల్లేష్,లాజర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైనుకు మరమ్మతులు

మరమ్మతులు చేయిస్తున్న ఈవో కంది మహేష్

సారపాక, ఆగస్టు 31: సారపాకలోని ఐటీసీ ఈస్ట్ గేట్ సమీపంలో లారీలు నిలిపి ఉంచడం వల్ల ప్రధాన తాగునీటి పైపులైను లీకై మంచినీటి సరఫరాకు ఇబ్బంది ఏర్పడింది. విషయం తెలుసుకున్న పంచాయతీ ఈవో కంది మహేష్ పంచాయతీ సిబ్బందితో శనివారం వెళ్లి లీకవుతున్న పైపులైను వద్ద మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో పంచాయతీరాజ్ ఉద్యోగి మృతి

పర్ణశాల, ఆగస్టు 31: మండలంలోని పెద్దనల్లబెల్లి గ్రామానికి చెందిన పంచాయతీరాజ్ ఉద్యోగి గుడిపాటి గౌరయ్య (49) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గౌరయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో శుక్రవారం మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. శనివారం చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గౌరయ్య మృతి పట్ల తోటి ఉద్యోగులు, బంధుమిత్రులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.